W W W.EPAPER.MAHADAILY.COM

# మహా పత్రిక





ఖమ్మం

భద్రాద్రి కొత్తగూడెం

16-7-2025




05

## మంత్రి పొంగులేటితో ఎమ్మెల్యే కోరం కనకయ్య భేటీ

తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య హైదరాబాద్ మినిస్టర్ క్వార్టర్స్ కాంగ్రెస్ ముఖ్య నాయకులతో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సంర్భంగా ఇల్లందు నియోజకవర్గ ప్రగతి, నామినేటెడ్ పదవులపై, స్థానిక ఎన్నికలపై చర్చించారు.



07

## వైభవంగా చండీ కుబేర పాశుపత యాగం

ఈ యాగ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం, కరీంనగర్ మాజీ ఎమ్మెల్యే మృత్యుంజయ శర్మ దంపతులు హాజరై, అమ్మవారికి పట్టు వస్త్రాలు, పూలు, పండ్లు సమర్పించారు. వేదపండితుల ఆశీర్వచనాలు అందుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వేముల వీరేశం మాట్లాడుతూ, "అమ్మవారి ఆశీర్వాదంతో తెలంగాణ రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని కోరుకుంటున్నాం. అర్చకుల వేతనాలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి, వేతనం రూ. 23,000 నుంచి తగ్గకుండా ఉండేలా నా వంతు కృషి చేస్తాను," అని హామీ ఇచ్చారు.



07

## వైరా రిజర్వాయర్ నుంచి 22 వేల ఎకరాలకు సాగునీరు విడుదల

రైతుల కష్టానికి సాగునీటిని అందిస్తూ, వైరా రిజర్వాయర్ ఆయకట్టకు నీళ్లు విడుదల చేయడమై జిల్లాలో సంతోషం వెల్లివిరిచింది. వేదమంత్రాల మధ్య, భక్తిశ్రద్ధలతో సాగునీటి విడుదలను ప్రారంభించిన వైరా శాసనసభ్యులు మాలోత్ రాందాస్ నాయక్ , రైతుల మోక్షంగా కనిపించారు. ఈ కార్యక్రమంలో ఆయనతో పాటు రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



# యూరియా ఏదయా..!

## కొరత భయంతో ముందస్తు కొనుగోళ్లు

- ఎరువులపై మార్కెట్ మోసాలు
- ఉమ్మడి జిల్లాల్లో పెరిగిన వాడకం
- అధిక ధరలకు అమ్మకాలు.. ఆందోళనలో రైతు

ఖమ్మం, మహా

ఉమ్మడి ఖమ్మం జిల్లాలో వానాకాలం సాగు జోరు మీద ఉంది. ఇలాంటి సమయంలో, రైతులు అత్యవసరంగా ఉపయోగించే యూరియా ఎరువులపై పెరుగుతున్న డిమాండ్, కొరత భయంతో ముందస్తుగా బస్తాలు కొనుగోలు చేయడ మే కాదు, వాటిని ఇంటి వద్ద నిల్వ చేసుకు నేందుకు పోటీపడుతున్నారు. మరోవైపు, వ్యవసాయ శాఖ, సహకార సొసైటీల వద్ద తగినన్ని నిల్వలున్నాయని చెబుతున్నా, బహిరంగ మార్కెట్‌లో యూరియా మాఫియా కదలి కలతో రైతులు మానసికంగా ఒత్తిడికి లోనవుతున్నారు.

08



# ప్రతి ఒక్క అధికారి విధులను సమర్ధవంతంగా నిర్వర్తించాలి



**ఖమ్మం,మహా:** సమీకృత జిల్లా కలెక్టరేట్ లో పని చేసే ప్రతి ఒక్క అధికారి, ప్రభుత్వ సిబ్బంది తమ విధులను సమర్థవంతంగా నిర్వర్తించాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. మంగళవారం సమీకృత జిల్లా కలెక్టరేట్ లోని ప్రభుత్వ కార్యాలయాలను జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. కార్మిక శాఖ, జిల్లా ఖజానా కార్యాలయం, భోజన శాల, కలెక్టరేట్ రెవెన్యూ విభాగం, ముఖ్య ప్రణాళిక అధికారి, ఉపాధి అధికారి, టూరిజం, డిఆర్డీవో, టౌన్ ప్లానింగ్, వ్యవసాయ శాఖ, విద్యాశాఖ, జిల్లా వైద్యారోగ్య శాఖ, భూ సేకరణ విభాగం, ఏడి డ్రగ్స్ కంట్రోల్, ఏడి మైన్స్, భూ సేకరణ, జిల్లా సంక్షేమ అధికారి కార్యాలయాలను, రికార్డు రూములను, ఓపెన్ లాంజ్, టాయిలెట్స్, క్యాంటీన్ లను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ ఉద్యోగుల భోజనశాల గదిలో త్రాగునీరు సౌకర్యం కల్పించాలని, ప్రభుత్వ కార్యాలయాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, కార్యాలయాల్లో ప్రతి ఫైల్ పకడ్బందీగా రికార్డు నిర్వహించాలని కలెక్టర్ తెలిపారు. జిల్లా విద్యాశాఖ కార్యాలయ తనిఖీ లో భాగంగా విద్యా శాఖ అధికారులతో మాట్లాడుతూ, జిల్లాలో ఒక మండలాన్ని పైలట్ గా తీసుకొని వంద శాతం అక్షరాస్యత సాధన దిశగా చర్యలు తీసుకోవాలని, ప్రతి ఒక్కరూ 10వ తరగతి ఓపెన్ స్కూల్ ద్వారా ఉత్తీర్ణత సాధించేలా ప్రణాళికాబద్ధంగా చర్యలు చేపట్టి, సంపూర్ణ అక్షరాస్యత మండలంగా ప్రకటించేలా కార్యాచరణ చేయాలని కలెక్టర్ తెలిపారు. ఇటుక బట్టిలలో పని చేసే వారి పిల్లలకు తప్పనిసరిగా విద్య అందేలా చూడాలని అన్నారు. ప్రతి శాఖలో సిబ్బంది ఔట్ సోర్సింగ్, డిప్యూటేషన్ అధికారుల హాజరు కూడా బయో మెట్రిక్ ద్వారా తీసుకోవాలని అన్నారు. ప్రభుత్వ ఉద్యోగుల మెడికల్ రియంబర్స్మెంట్ ఫైల్స్ సకాలంలో డిస్పోజ్ చేయాలని అన్నారు. ప్రతి వారం ప్రజావాణి దరఖాస్తుల స్టేటస్ తో పాటు ప్రతి శాఖలోని అధికారులు, సిబ్బంది హాజరు వివరాలు అందించాలని అన్నారు. అధికారులు, సిబ్బంది ముందు అనుమతి లేకుండా గైర్హాజరు కారాదని, వైద్య కారణాలపై సెలవుల్లో ఉన్న వారి కారణాలు సహేతుకంగా ఉన్నవి లేనివి పరిశీలించాలన్నారు. ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చే ప్రజలను ఎక్కువ సమయం ఎదురు చూసేలా చూడవద్దని, వారి దరఖాస్తులను మానవతా దృక్పథంతో పరిశీలించి పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించారు. కార్యాలయం లోపల ఓపెన్ లాంజ్ లలో పచ్చదనం కొరకు మంచి మొక్కలు నాటాలని, ఆకర్షణీయంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. కార్యాలయ పరిసరాల్లో ఖాళీ ప్రదేశాల్లో వన మహోత్సవం క్రింద మొక్కలు నాటాలని, గ్యాప్ లన్ని భర్తీచేయాలని కలెక్టర్ అన్నారు. క్యాంటీన్ పరిశీలించి వ్యాపారం ఎలా నడుస్తుంది, ఆర్థికంగా లాభాలు ఉన్నయా అంటూ వివరాలు అడిగి తెలుసుకున్నారు. క్యాంటీన్ లో టీ త్రాగి, కలెక్టర్ స్వయంగా డబ్బులను చెల్లించారు. ఈ తనిఖీలో జిల్లా కలెక్టర్ వెంట డిఆర్ఓ ఏ. పద్మశ్రీ, కలెక్టరేట్ పరిపాలన అధికారి కే. శ్రీనివాస రావు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## నలుగురికి ఎల్ వోసీ పత్రాలు అందజేసిన ఖమ్మం ఎంపీ రఘురాం రెడ్డి

**ఖమ్మం సిటీ, మహా:** పార్లమెంట్ సభ్యులు రామసహాయం రఘురాం రెడ్డి సిఫారసుతో నలుగురికి మోకాలి శస్త్ర చికిత్స కోసం ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి రూ.6 లక్షలు మంజూరయ్యాయి. కారేపల్లి మండలం కొత్త కమలాపురం గ్రామానికి చెందిన కొల్లి నాగమ్మ, జాలా ధనమ్మ, మొండేపూడి కృష్ణారావు, మండేపూడి సత్యమ్మ లు మోకాలి శస్త్ర చికిత్స అవసరమై..ఆర్థిక తోడ్పాటు కోసం ఇటీవల ఎంపీ ని కలిసి విన్నవించగా.. వెంటనే స్పందించి మంజూరు చేయించిన ఎల్ వోసీ పత్రాలను మంగళవారం హైదరాబాద్ లోని తన నివాసం వద్ద బాధితులకు అందజేశారు. నిజామ్స్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(నిమ్స్) లో మోకాలి ఆపరేషన్ కోసం ఒక్కొక్కరికీ రూ. 1.50 లక్షల చొప్పున కేటాయించారని, శస్త్ర చికిత్స విజయవంతమై త్వరగా కోలుకోవాలని పార్లమెంట్ సభ్యులు రఘురాం రెడ్డి ఆకాంక్షించారు. ఈ సందర్భంగా వారంతా ఎంపీకి కృతజ్ఞతలు తెలిపారు.



## వరి నాట్లను పరిశీలించిన అగ్రికల్చర్ మండల అధికారి

**కూసుమంచి, జులై 15, మహా:** కూసుమంచి మండలంలోని గట్టుసింగారం గ్రామంలో మండల వ్యవసాయ అధికారి రామడుగు వాణి భాస్వరం కరిగించే బ్యాక్టీరియాపై నారు కట్టలు పిఎస్బీ ద్రావణంలో ముంచే పద్ధతి గురించి క్షేత్ర ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భాస్వరం కరిగించు బ్యాక్టీరియాను వినియోగించడం వలన భూమిలో పేరుకుపోయిన భాస్వరాన్ని కరిగించి మొక్కకు అందుబాటులో స్థితిలోకి తీసుకురావడం జరుగుతుందని తెలియ జేశారు. ఈ పి.ఎస్.బి ద్రావణాన్ని విత్తన శుద్ధి ద్వారా, నారుకట్టలు ముంచే పద్ధతి ద్వారా మరియు ప్రధాన పొలంలో పశువుల ఎరువుతో కలిపి చల్లడం ఈ మూడు పద్ధతుల్లో ఏదో ఒక పద్ధతిని అనుసరించి వినియోగించవచ్చు అని, తద్వారా భూమిలో పేరుకుపోయిన భాస్వరాన్ని కరిగించడమే కాకుండా భాస్వరం ఎరువులపై పెట్టే ఖర్చును కూడా తగ్గించుకోవచ్చు అని తెలియజేశారు.

## భద్రాచలం ఏజెన్సీలో అధిక ఫీజులు నియంత్రించాలి



**మహా భద్రాచలం:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఏజెన్సీ ప్రాంతమైన భద్రాచలంలో కొన్ని ప్రైవేట్ పాఠశాలలు కార్పొరేట్ స్థాయి ఫీజులను వసూలు చేస్తున్నారని వారిపై చర్యలు తీసుకోవాలని జాతీయ వినియోగదారులు, మానవ హక్కుల పరిరక్షణ సమితి తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి చెట్టి జస్వంత్ భద్రాచలం విద్యాశాఖ అధికారికి వినతి పత్రం అందజేశారు, ఈ సందర్భంగా చెట్టి జస్వంత్ మాట్లాడుతూ, భద్రాచలంలో కార్పొరేట్ స్కూల్ పేరుతో అధిక ఫీజులు వసూలు చేస్తున్నారని, విద్య చట్టాలను గౌరవించడం లేదని అన్నారు, విద్యాహక్కు చట్టం ద్వారా ఏజెన్సీ ప్రాంతంలో 25% ఎస్సీ ఎస్టీ విద్యార్థులకు ప్రైవేట్ పాఠశాలలు ఉచిత విద్యను అందించాలని డిమాండ్ చేశారు.జర్నలిస్టుల పిల్లలకు జిల్లా విద్యాశాఖ అధికారి ఇచ్చిన ఆదేశాలనుసారం ప్రైవేట్ పాఠశాలలు ఫీజులలో 50% రాయతీ కల్పించాలనిఅన్నారు.

## ఈ ఓ పై దాడిని తీవ్రంగా పరిగణించిన సాదు పరిషత్

**మహా భద్రాచలం:** భద్రాచలం శ్రీసీతారామ చంద్రస్వామి దేవస్థానం ఈ ఓ రమాదేవి పై భూ ఆక్రమణ దారులు చేసిన దాడిని సాదుపరిషత్ తీవ్రంగా పరిగణించింది. ఈ మేరకు ఆనందాశ్రమ పీఠధిపతి, సాధు పరిషత్ అధ్యక్షులు శ్రీనివాసానంద సరస్వతి స్వామి ఆధ్వర్యంలో పలువురు స్వామీజీలు ఆంధ్ర రాష్ట్రం పురుషోత్తమపట్నం లోని రామాలయం భూములను గురువారం సందర్శించనున్నారు.అయితే వివాదాస్పద భూములలోకి స్వామీజీలు వెళ్తే మళ్ళీ ఘర్షణ వాతావరణం చోటుచేసుకునే అవకాశం ఉంది. కనీసం 100 మందికి పైగా స్వామీజీలు, హిందూ సంఘాల నాయకులు, బీజేపీ నాయకులు ఈ పర్యటనలో పాల్గొననున్నట్లు తెలిసింది. ఆంధ్ర పోలీసులు స్పందించి భారీ భద్రత ఏర్పాటు చేయకపోతే మళ్ళీ గతంలో జరిగిన సంఘటనలు పునరావృతం అయ్యే అవకాశం లేకపోలేదు. ఇది మరో అయోధ్య సమస్య లాగా కాకుండా ఆంధ్ర, తెలంగాణా ప్రభుత్వాలు త్వరగా మేల్కొని సమస్యను పరిష్కరించాలని భక్తులు కోరుకుంటున్నారు.

## జులై 28 నుండి మావోయిస్టు అమరవీరుల వారోత్సవాలు

**మహా భద్రాచలం:** ఈనెల 28 వ తేది నుండి ఆగష్టు 3 వ తేది వరకూ మావోయిస్టు అమరవీరుల వారోత్సవాలు నిర్వహించనున్నట్లు మావోయిస్టు కేంద్ర కమిటీ పేర్కొంది. ఈ మేరకు 24 పేజీల ఒక లేఖను విడుదల చేసింది. ఇప్పటివరకు సంవత్సర కాలంలో 357 మంది మావోయిస్టులు వివిధ ఎన్కౌంటర్లలో మృతి చెందారని, వారిలో 136 మంది మహిళా మావోయిస్టులు ఉన్నారని పేర్కొన్నారు. నలుగురు కేంద్ర కమిటీ సభ్యులతో సహా 15 మంది రాష్ట్ర కమిటీ సభ్యులు మరణించారని, వారి త్యాగాన్ని స్మరించుకుంటూ ఈ నెల 28 నుండి ఆగష్టు 3 వ తేది వరకూ అమరవీరుల సంస్మరణ వారోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆ లేఖలో తెలిపారు.

## నేడు దమ్మపేటలో మంత్రి పొంగులేటి పర్యటన



**దమ్మపేట ,జూలై 15 మహా :** రాష్ట్ర రెవిన్యూ ,గృహ నిర్మాణ ,పౌరసంబంధాల శాఖా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మండల కేంద్రంలో బుధవారం పర్యటించనున్నారు. ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ పాఠశాల ఆవరణలో నిర్వహించనున్న ఇందిరా మహిళాశక్తి సంబరాలలో ఆయన పాల్గొంటారని స్థానిక అశ్వారావుపేట శాసన సభ్యులు జారె ఆదినారాయణ క్యాంపు కార్యాలయం నుండి తెలిపారు.ఈ కార్యక్రమంలో మహిళలకు వడ్డిలేని స్వయం సహాయక రుణాల పంపిణీ చేయనున్నారు. సాయంత్రం 4 గంటలకు జరిగే కార్యక్రమానికి కాంగ్రెస్ నాయకులు ,కార్యకర్తలు ,అభిమానులు ,అధికారులు ,మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

# ఇందిరమ్మ ఇళ్లకు శంకుస్థాపన



**మధిర, మహా:** మధిర మండలం రాయపట్నం గ్రామంలో ఇల్లు లేని పేదల కోసం మంజూరైన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి శంకుస్థాపన కార్యక్రమం ఘనంగా జరిగింది. రాష్ట్ర ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క కృషి ఫలితంగా ఈ ఇళ్ల మంజూరు జరిగింది. ఈ సందర్భంగా అద్దంకి రవికుమార్ మాట్లాడుతూ – "పాదయాత్రలో భట్టి విక్రమార్క గారికి పేదల ఇళ్ల సమస్య చెప్పిన సమయంలో ఇచ్చిన హామీని నేడు నెరవేర్చడం గర్వకారణం. ప్రతి అర్హుడికి ఇల్లు మంజూరు చేయడం పేదలకు పండుగ వాతావరణం తేవడం వంటిదే," అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సూరంశెట్టి కిషోర్, సహకార సంఘాల డైరెక్టర్లు అద్దంకి రవికుమార్, అల్లాడి గోపాలరావు, గ్రామ మాజీ సర్పంచ్ బొమ్మకంటి హరిబాబు, నిడామనూరి వంశి, కర్నాటి రామారావు, చిలువేరు బుచ్చయ్య, పులిబండ్ల చిట్టిబాబు, ఆవుల ఝాన్సికిరణ్, అదూరి శ్రీను, బిట్రా ఉద్దండు, శాసనాల శ్రీను, యార్ల సాంబయ్య, యార్ల పూర్ణయ్య, ఆవుల శ్రీనివాసరావు, పార్శపు జంగమ్మ, కోట రవిచంద్ర భూపాల్, గోళ్ళ ఉద్దండయ్య, మాగంటి జంపయ్య, దూదేకుల జాని, సంగెపు రేణుక, సాతులూరి నాగభూషణం, తుమ్మలపల్లి మురళి, కటారపు సుభాష్ చంద్రబోస్, జింకల రామకృష్ణ, గుగ్గిలపు నాగరాజు, పార్శపు లబాన్, నాని, ఏసోబు తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో గృహ నిర్మాణ శాఖ ఇంజినీరు అక్తార్, గ్రామ పంచాయతీ కార్యదర్శి, మహిళలు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. గ్రామస్థులు ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకు కృతజ్ఞతలు తెలిపారు.



**బోనకల్, మహా:** బోనకల్ మండలం రావినూతల గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి శంకుస్థాపన కార్యక్రమం శుభారంభమైంది. ఈ సందర్భంగా లబ్ధిదారులు ఎంతో ఉత్సాహంతో పాల్గొన్నారు. షేక్ సిలార్ బీ ఇంటి శంకుస్థాపన కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు. గ్రామ శాఖ అధ్యక్షుడు తాళ్లూరి రవి శంకుస్థాపన చేసి ప్రారంభం చేశారు. ఈ కార్యక్రమంలో మండల సీనియర్ కాంగ్రెస్ నేత చేబ్రోలు వెంకటేశ్వర్లు, మధిర మార్కెట్ కమిటీ డైరెక్టర్ వట్టికొండ రామకృష్ణ, ఎస్టీ సెల్ మండల అధ్యక్షుడు బానోతు శ్రీను నాయక్, ఇందిరమ్మ గ్రామ కమిటీ సభ్యులు వై. హేమూన్, బంధం సైదులు, ఆవునూరి సత్యనారాయణ, బుడగ జంగం మండల అధ్యక్షుడు పాటి నాగరాజు, యువజన కాంగ్రెస్ నాయకుడు ఇండ్ల నాని తదితరులు పాల్గొన్నారు. గ్రామస్థులు ప్రభుత్వం తీసుకుంటున్న ఈ సంక్షేమ చర్యలపై హర్షం వ్యక్తం చేశారు.

# భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు నేషనల్ జియోస్పేషియల్ ప్రాక్టీషనర్ అవార్డ్

**భద్రాద్రి కొత్తగూడెం, జూలై 15 (మహా):** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా యంత్రాంగానికి ప్రతినిధిగా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ కు నేషనల్ జియోస్పేషియల్ ప్రాక్టీషనర్ అవార్డు' లభించింది. ఈ అవార్డు జూలై 17, ఐఐటీ బాంబేలో జరుగనున్న 'ఓపెన్ సోర్స్ జిఐఎస్ డే' లో 'ఇస్రో' మాజీ చైర్మన్ కిరణ్ కుమార్ చేతుల మీదుగా ప్రదానం చేయబడనుంది. భారతదేశంలో జిల్లా స్థాయిలో మొట్టమొదటిగా 'ఓపెన్ సోర్స్ జిఐఎస్ కోహార్ట్' ఏర్పాటు చేసి, గ్రామీణ సమస్యల పరిష్కారానికి జియోస్పేషియల్ టెక్నాలజీని ప్రాక్టికల్‌గా వినియోగించడంలో కలెక్టర్ విశిష్టమైన కృషి చేశారు. గోదావరి వరదలపై ఫ్లడ్ ప్రిడిక్షన్ అనాలిసిస్ కోసం జిఐఎస్ ఆధారంగా పరిష్కారాలను అమలు చేయడానికి తొలిసారిగా ప్రయత్నాలు చేయడం, గ్రామీణ స్థాయిలో జిఐఎస్ స్కిల్లింగ్, సామర్థ్య నిర్మాణంలో ఉన్నత నమూన రూపొందించడం వలన కలెక్టర్ కు ఈ అవార్డు లభించింది. ఈ ప్రాజెక్టులో తొలి అడుగుగా, జిల్లా కలెక్టర్ చొరవతో ఐఐటి బాంబే ఫోస్సీ జిఐఎస్ మరియు దాని భాగస్వామి హెచ్ పీ హెచ్ ఎఫ్ తో కలిసి భారతదేశపు మొట్టమొదటి "ఓపెన్ సోర్స్ జిఐఎస్ కోహార్ట్" ను మే 6, 7 తేదీలలో అనుబోస్ ఇంజనీరింగ్ కాలేజీ, కొత్తగూడెంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లాలోని అగ్రికల్చర్, మైనింగ్, ఇంజనీరింగ్ విద్యార్థులు, ఇరిగేషన్ అధికారులు పాల్గొన్నారు. క్యూజిఐఎస్ ద్వారా గ్రామీణ సమస్యల పరిష్కారానికి జియోస్పేషియల్ డేటా వినియోగం ఎలా చేయాలో ప్రాక్టికల్‌గా నేర్పించారు. ఉదాహరణకు, గోదావరి వరదల సమయంలో నీటి స్థాయిని బట్టి ముంపు గ్రామాలను ముందుగానే గుర్తించి హెచ్చరికలు జారీ చేయడ%శీ%, వివిధ పిహెచ్సి మరియు సబ్ సెంటర్ పరిధిలో గల గవర్నమెంట్



స్కూల్స్ నీ జిఐఎస్ ద్వారా మ్యాప్ చేసి, పి హెచ్ సి పరిధిలో విద్యార్థులు ఆరోగ్యం పట్ల డాక్టర్లను అప్రమత్తం చేయటం. ఈ విధంగా , వివిధ శాఖల సమాచారాన్ని, భౌగోళిక సమాచారంతో కలిపి అనాలసిస్ చేసి ముఖ్యమైన నిర్ణయాలు తీసుకునేలా జిఐఎస్ ఉపయోపడుతుంది. భౌగోళిక డేటా ఆధారంగా క్షేత్రస్థాయి సమస్యలకు సమర్థవంతమైన పరిష్కారాలు కనుగొనడం వంటి అంశాలపై ట్రైనింగ్ ఇచ్చారు. ఈ ప్రాజెక్ట్ ప్రస్తుతం అభివృద్ధి దశలో కొనసాగుతోంది. ఇటువంటి జిఐఎస్ సాఫ్ట్వేర్ అందరికీ అందుబాటులో, గ్రామీణ ప్రాంతాలకు కూడా అందించటం ముఖ్యమైన మైలురాయిగా పేర్కొనవచ్చు. తదుపరి దశలో ప్రతిభావంతమైన విద్యార్థులను ఎంపిక చేసి, ఐఐటీ బాంబే, ఫోస్సీ జిఐఎస్ సహకారంతో ఓపెన్ సోర్స్ జిఐఎస్ ఉపయోగించి, గ్రామీణ సమస్యల పరిష్కారానికి భౌగోళిక సమాచారమును ఏ విధముగా ఉపయోగించాలో విద్యార్థులకు ఇంటర్న్‌షిప్‌లు రూపంలో నేర్పించడానికి ప్రణాళికలు రూపొందించబడ్డాయి. ఇలా మన జిల్లా అభివృద్ధి పథంలో ముందు ఉండగా, భద్రాద్రి కొత్తగూడెం కలెక్టర్ ఈ ప్రయత్నంలో కృషి పడిన హెచ్ పీ హెచ్ ఎఫ్ బృందానికి, ఆస్పిరేషన్ బ్లాక్ ఫెలో నవనీత్ కి అభినందనలు తెలిపారు. ఈ అవార్డు రావడం జిల్లా వాసులందరికీ గర్వకారణం అని వెల్లడించారు. ఈ అవార్డును ఫోస్సీ (జిఐఎస్), ఐఐటీ బాంబే, విద్యాశాఖ, భారత ప్రభుత్వం (ఎన్.ఎం.ఇ.ఐ.సి.టి) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'నేషనల్ జియోస్పేషియల్ అవార్డ్స్ 2025 (ఎడిషన్ 02)' కింద ప్రదానం చేయనున్నారు. జియోస్పేషియల్ టెక్నాలజీ వినియోగాన్ని ప్రోత్సహించడానికి, 'నేషనల్ జియోస్పేషియల్ పాలసీ 2022' మరియు 'ఇండియన్ స్పేస్ పాలసీ 2023' కు అనుగుణంగా ఈ అవార్డులు అందించబడుతున్నాయి. భారత ప్రభుత్వం 2022 డిసెంబరు 28న జాతీయ జియోస్పేషియల్ పాలసీ 2022 ను ప్రవేశపెట్టింది. దీని ముఖ్య ఉద్దేశ్యం సామాన్య ప్రజలకు జియోస్పేషియల్ సమాచారం అందుబాటులోకి తీసుకువచ్చి, ఆ ఆధారంగా ఆవిష్కరణలను ప్రోత్సహిస్తూ, క్షేత్రస్థాయిలో సమస్యలను పరిష్కరించుకునే అవకాశాలను కల్పిస్తూ, జాతీయ అభివృద్ధి మరియు ఆర్థిక శ్రేయస్సుకు బలమైన జియోస్పేషియల్ వ్యవస్థను ఏర్పాటు చేయడం. ఈ విధంగా జియోస్పేషియల్ టెక్నాలజీని సమర్థంగా వినియోగిస్తూ, ప్రజల సమస్యల పరిష్కారానికి ఉపయోగపడే విధంగా పనిచేస్తున్న భద్రాద్రి కొత్తగూడెం జిల్లా యంత్రాంగాన్ని గుర్తించి జిల్లా కలెక్టర్ కు ఈ అవార్డు లభించడం, జిల్లాకు గర్వకారణం.

# జూలై 31న ప్రదర్శన



**ఖమ్మం సిటీ, మహా:** తెలంగాణలో కార్మికుల న్యాయ హక్కుల కోసం ఈ నెల 31న అన్ని జిల్లా కేంద్రాల్లో పెద్ద ఎత్తున ధర్నాలు నిర్వహించనున్నట్లు టి.యు.సి.ఐ రాష్ట్ర కార్యదర్శి ఎస్.ఎల్. పద్మ తెలిపారు. మంగళవారం ఖమ్మంలోని రామనర్సయ్య విజ్ఞాన కేంద్రంలో టి.యు.సి.ఐ జిల్లా కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి జిల్లా అధ్యక్షుడు ఏ.వెంకన్న అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా మాట్లాడిన ఎస్.ఎల్. పద్మ మాట్లాడుతూ, ప్రస్తుతం రాష్ట్రంలో కార్మికుల పరిస్థితి దిగజారిందన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయలేదు. వేతనాలు పెంచకుండా, కార్మిక సంఘాలతో చర్చించకుండా పాలన కొనసాగించిందని విమర్శించారు. కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేస్తామని చెప్పి చివరకు మోసం చేశారని తెలిపారు.

# రేపు కూసుమంచిలో ఇందిరా శక్తి సంబరాలు

**కూసుమంచి, జులై 15, మహా:** కూసుమంచి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణంలో ఇందిర శక్తి సంబరాలు కార్యక్రమం జరగనుంది. పాలేరు నియోజకవర్గ పరిధిలోని నాలుగు మండలాల నుండి స్వయం సహాయక బృందాలకు చెక్కులు పంపిణీ కార్యక్రమం జరగనుంది. ఈ కార్యక్రమానికి మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ముఖ్య అతిథిగా హాజరవుతున్నారు. కాగా కార్యక్రమంకు సంబంధించిన పనులను కూసుమంచి సీఐ సంజీవ్, ఎస్ఐ నాగరాజు, క్యాంప్ కార్యాలయం ఇంచార్జి భీమిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు రామసహాయం వెంకట్ రెడ్డి, మాదాసు ఉపేందర్ రావు, బారి వీరభద్రం, కంచర్ల జీవన్ రెడ్డి, వడిత్య సెట్ రాం, నాగిరెడ్డి రంగారెడ్డి, యూత్ విభగం బెల్లంకొండ కిరణ్, కొండ మహిపాల్, వడిత్య కుమార్, శేఖర్ రెడ్డి, మొహమ్మద్ రఫీ పాల్గొన్నారు.

# విద్యుత్ సదుపాయాల అభివృద్ధిలో ముందడుగు

**కామేపల్లి, మహా:** రైతులకు వినియోగంలో ఎలాంటి ఇబ్బంది లేకుండా చూడటానికి ఖమ్మం జిల్లాలో విద్యుత్ శాఖ వేగంగా పని చేస్తోంది. ఈ క్రమంలో కామేపల్లి మండలంలోని కొత్తలింగాలలో ట్రాన్స్‌ఫార్మర్ల మర్మతుల కేంద్రానికి భూమిపూజ జరిగింది. అదే రోజు సింగరేణి మండలం చీమలపాడు విద్యుత్ సబ్‌స్టేషన్‌లో కొత్తగా ఒక పెద్ద ట్రాన్స్‌ఫార్మర్‌ను పని చేయించేలా ప్రారంభించారు. కొత్తలింగాలలో ఏర్పాటు చేయనున్న మర్మతుల కేంద్రం వల్ల కామేపల్లి, సింగరేణి, రఘునాథపాలెం, ఏంకుర్ మండలాల్లో రైతులు ఎదుర్కొంటున్న ట్రాన్స్‌ఫార్మర్లు పాడయ్యే సమస్యను త్వరగా పరిష్కరించొచ్చు. ఎక్కడెక్కడ కాలిపోయిన ట్రాన్స్‌ఫార్మర్లు ఉన్నా వాటిని వెంటనే తీసుకొచ్చి, వెంటనే మళ్ళీ పనికి వచ్చేటట్టు చేస్తారు. దీనివల్ల రైతులకు ఇబ్బంది లేకుండా వ్యవసాయ పనులు కొనసాగించుకోవచ్చు. ఈ కార్యక్రమంలో ఖమ్మం జిల్లా అధికారి ఇనుగుర్తి




శ్రీనివాసచారి, ఎంఆర్టి మరియు నిర్మాణ అధికారి భద్రుపవర్, ఖమ్మం ఆపరేషన్ అధికారి రామారావు, సివిల్ అధికారి, కొత్తలింగాల సహాయ ఇంజినీరు ఆనంద్ కుమార్, ఇతర శాఖల సిబ్బంది పాల్గొన్నారు. ఇక చీమలపాడు విద్యుత్ కేంద్రంలో వ్యవసాయ విద్యుత్ అవసరాలు పెరగడం, వోల్టేజ్ తక్కువగా ఉండడం లాంటి సమస్యలు ఉండటంతో, అటు గ్రామాల్లో సమస్యల్ని తగ్గించేందుకు కొత్తగా మరో ట్రాన్స్‌ఫార్మర్‌ను పనిచేయించటానికి ప్రారంభించారు. ఇది 5 మెగావాట్ల సామర్థ్యం గలది. దీనివల్ల అక్కడి రైతులకు మంచి వోల్టేజ్ లభిస్తుంది. వ్యవసాయ బోర్లు సాఫీగా నడుస్తాయి. ఈ కార్యక్రమంలో కూడా జిల్లా అధికారి శ్రీ ఇనుగుర్తి శ్రీనివాసచారి, అధికారులైన భద్రుపవర్, రామారావు, రాందాస్, ఆనంద్ కుమార్, రామకృష్ణ, రాజేష్ పాల్గొన్నారు.

# రైతుల సంక్షేమానికి విద్యుత్ శాఖ కృషి

## వేగంగా సాగుతున్న వ్యవసాయ సేవల విస్తరణ



**ఖమ్మం, మహా:** తెలంగాణ రాష్ట్రంలోని రైతులకు నాణ్యమైన విద్యుత్ సేవలు అందించేందుకు ప్రభుత్వం పలు ముందడుగులు వేసింది. రైతుల శ్రేయస్సును లక్ష్యంగా పెట్టుకుని వ్యవసాయ రంగానికి మేలు చేకూర్చే విధంగా విద్యుత్ శాఖ కార్యాచరణను మరింత బలోపేతం చేస్తోంది. ఖమ్మం జిల్లాలో ఈ మార్పులకు సర్కిల్ సూపరింటెండింగ్ ఇంజనీర్ ఇనగుర్తి శ్రీనివాస చారి నేతృత్వం వహిస్తున్నారు. ఆయన తాజాగా మాదిరిగానే మీడియాకు ఇచ్చిన ప్రకటనలో వివిధ కార్యక్రమాలను విశదీకరించారు. 2023–24 కాలానికి సంబంధించి 3,875 వ్యవసాయ సర్వీసులను మంజూరు చేసిన విద్యుత్ శాఖ, 2024–25లో ఆ సంఖ్యను 4,018కి పెంచినట్లు తెలిపారు. అంటే గత సంవత్సరం కంటే 143 సర్వీసులు అధికంగా మంజూరయ్యాయి. ఇది దాదాపు 14 శాతం వృద్ధికి సూచనగా చెప్పవచ్చు. రైతుల అవసరాలను దృష్టిలో పెట్టుకొని విద్యుత్ కనెక్షన్ల మంజూరులో వేగం పెంచామని అన్నారు. విద్యుత్ అధికారులు "పొలంబాట" పేరుతో తాము ప్రత్యక్షంగా పల్లెల్లోకి వెళ్లి రైతుల సమస్యలు తెలుసుకుని పరిష్కరిస్తున్నామని శ్రీనివాస చారి తెలిపారు. ఇప్పటివరకు 1,937 లూజ్ లైన్లు, 1,426 వంగిన పోల్స్, 2,013 మధ్య స్తంభాలు మార్చినట్లు వివరించారు. మోటార్ల మన్నిక పెరగడంతో పాటు ట్రాన్స్ఫార్మర్లపై భారం తగ్గించేందుకు కెపాసిటర్ల అమర్పు చేస్తున్నట్టు తెలిపారు. ఇది రైతుల కోసం అవగాహన కల్పించాల్సిన కీలక అంశమని పేర్కొన్నారు. రైతులకు మరింత స్పష్టత కల్పించేందుకు వ్యవసాయ విద్యుత్ ఎస్టిమేట్ కాపీలను తెలుగులో అందిస్తున్నామని, మెటీరియల్స్ వివరాలు, నక్షా వంటి సమాచారం ఎస్ఎంఎస్ లింకుల ద్వారా కూడా తెలుగులో అందుబాటులో ఉంచామని చెప్పారు. ఈ విధానంతో రైతులకు ఎటువంటి సందేహాలు లేకుండా పని స్పష్టతగా అర్థమవుతుందని అన్నారు. ఏ రకం సామాగ్రి కొనుగోలు చేయాల్సిన అవసరం లేదని అధికారికంగా స్పష్టం చేశారు. ట్రాన్స్ఫార్మర్లు చెడిపోయిన సందర్భాల్లో వెంటనే స్పందించేందుకు విద్యుత్ శాఖ నాలుగు ప్రత్యేక వాహనాలను ఏర్పాటు చేసింది. ఎస్పీఎం షెడ్లు ఏర్పాటు చేసి మరమ్మతుల ప్రక్రియను వేగవంతం చేస్తున్నామని తెలిపారు. ఇలా మరమ్మతు కేంద్రాల విస్తరణతో రైతులకు వేగంగా సేవలు అందుబాటులోకి వస్తున్నాయి. వేసవిలో విద్యుత్ వినియోగం అధికమవుతుందనే అంచనాలతో ఇప్పటికే 360 కొత్త ట్రాన్స్ఫార్మర్లు అమర్చామని, ట్రాన్స్ఫార్మర్ల సామర్థ్యాన్ని 81 మేర పెంచామని చెప్పారు. అలాగే పిడుగుల నివారణ చర్యలుగా లైట్నింగ్ అరిస్టర్లను అమర్చడం జరుగుతోందని తెలిపారు. పట్టణాల్లో ట్రాన్స్ఫార్మర్లు కాలిపోతే 24 గంటల్లో, గ్రామాల్లో అయితే 48 గంటల్లో వాటిని భద్రపరుస్తున్నట్లు వివరించారు. ఈ పనిలో ప్రొఫెషనల్ నిబద్ధతను పాటిస్తున్నామని స్పష్టం చేశారు. రైతులు అనుభవించే విద్యుత్ సమస్యలపై చర్యలు తీసుకుంటూ, నాణ్యమైన సేవలు అందించడమే తమ ప్రధాన లక్ష్యమని శ్రీనివాస చారి తెలిపారు. వ్యవసాయ రంగానికి అవసరమైన విద్యుత్ కనెక్షన్లు, సేవల విస్తరణ, సమస్యల పరిష్కారం తదితర అంశాల్లో విద్యుత్ శాఖ వేగంగా స్పందిస్తున్నందున, రైతులు శ్రద్ధగా ఈ అవకాశాలను వినియోగించుకోవాలని సూచించారు.

## ప్రతి కేసులో సమగ్ర దర్యాప్తును చేపట్టి నేరస్తులకు శిక్ష పడే విధంగా అధికారులందరూ కృషి చేయాలి



**కొత్తగూడెం, మహా:** ప్రతి కేసులో సమగ్ర దర్యాప్తును చేపట్టి నేరస్తులకు శిక్ష పడే విధంగా అధికారులందరూ కృషి చేయాలి అని జిల్లా ఎస్పీ రోహిత్ రాజు అన్నారు. మంగళవారం జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఐపిఎస్ జిల్లా పోలీస్ హెడ్ క్వార్టర్స్ నందు జిల్లా పోలీస్ అధికారులతో నెలవారీ నేర సమీక్షా సమావేశాన్ని ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సమావేశంలో పాల్గొన్న పోలీస్ అధికారులతో ఎస్పీ మాట్లాడుతూ ప్రతీ కేసులో 'క్వాలిటీ ఆఫ్ ఇన్వెస్టిగేషన్' ద్వారా నేరస్తులకు శిక్షపడే విధంగా చేసి బాధితులకు న్యాయం చేకూర్చాలని సూచించారు. కేసుల విచారణలో జాప్యం చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. పోలీస్ అధికారులంతా బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. నిర్లక్ష్యంగా వ్యవహరించిన అధికారులపై క్రమశిక్షణా చర్యలు తప్పవని అన్నారు. పెట్రోలింగ్, బ్లూ కోల్ట్స్ వాహనాలతో అధికారులు, సిబ్బంది ఎల్లప్పుడూ రోడ్లపై తిరుగుతూ ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. గంజాయి వంటి మత్తు పదార్థాలు, మట్కా, జూదం లాంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రాపర్టీ కేసుల్లో ప్రస్తుతం పోలీసు శాఖ వినియోగిస్తున్న సాంకేతికతను ఉపయోగించి నేరస్తులను పట్టుకుని సొత్తును రికవరీ చేసి భాదితులకు త్వరతగతిన అందేలా చూడాలని తెలిపారు. సైబర్ నేరాల బారిన పడకుండా ప్రజలను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తూ అవగాహనా కార్యక్రమాలను ఏర్పాటు చేయాలని కోరారు. ఈ సమావేశంలో భద్రాచలం ఏఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్ ఐపిఎస్, కొత్తగూడెం డిఎస్పీ రెహమాన్, పాల్వంచ డిఎస్పీ సతీష్ కుమార్, మణుగూరు డిఎస్పీ రవీందర్ రెడ్డి, ఇల్లందు డిఎస్పీ చంద్ర భాను, డీసీఆర్బీ డిఎస్పీ మల్లయ్య స్వామి మరియు జిల్లాలోని సిఐలు, ఎస్సైలు , సిబ్బంది పాల్గొన్నారు.

## ఏడిఎంఅండ్హెచ్ఓగా సైదులు



**మహా భద్రాచలం:** భద్రాచలం ఐ టి డి ఏ కార్యాలయంలోని మెడికల్ విభాగంలో అడిషనల్ డీఎంహెచ్ ఓ గా బి. సైదులు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఖమ్మం జిల్లా డిప్యూటీ డి.ఎం.హెచ్.ఓ గా పనిచేస్తున్న ఆయనను పబ్లిక్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ డైరెక్టర్ రవీంద్ర నాయక్ ఏ డి ఎం అండ్ హెచ్ ఓ గా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేయడంతో ఆయన మంగళవారం భాధ్యతలు చేపట్టారు. ఇప్పటివరకు అడిషనల్ డిఎంహెచ్వో గా పని చేసిన చైతన్య నుండి బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్ను మర్యాద పూర్వకంగా కలిశారు.

## తెదేపా నూతన పట్టణ కమిటీ ఎన్నిక



**మహా భద్రాచలం:** తెలుగుదేశం పార్టీ భద్రాచలం నియోజకవర్గం ముఖ్య కార్యకర్తల సమావేశం గోదావరి ఫంక్షన్ హాల్ లో నిర్వహించారు. ఈ సమావేశానికి భద్రాచలం నియోజకవర్గం పరిశీలకులు వట్టం నారాయణ దొర ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సమావేశంలో తెలుగుదేశం నాయకులు పోటు రంగారావు, కొడాలి శ్రీనివాస్ , కుంచాల రాజారాం, కంభంపాటి సురేష్ , పిల్లంటి దేశప్ప, అభినేని శ్రీనివాస్ , సీనియర్ నాయకులు శ్రీనివాస్ , వాసిరెడ్డి చలపతిరావు, నూతలపాటి దాసయ్య, పాల్గొన్నారు. తెలుగుదేశం పార్టీ ఎన్డీఏ కూటమితో తెలంగాణ రాష్ట్రంలో అధికారానికి రావడం ఖాయం అని, భద్రాచలం నియోజకవర్గం లో తెలుగుదేశం పార్టీ ప్రతి గ్రామంలో చంద్రబాబు నాయుడు నాయకత్వంలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు నేటికీ ప్రజలకు ప్రయోజనకరంగా ఉన్నాయని వక్తలు పేర్కొన్నారు.

## ముగిసిన పోస్టల్ ఎంప్లాయిస్ మహా సభలు



**మహా భద్రాచలం:** గత రెండు రోజులుగా భద్రాచలంలో నిర్వహిస్తున్న నేషనల్ యూనియన్ ఆఫ్ పోస్టల్ ఎంప్లాయిస్ గ్రూప్ సి మహాసభలు మంగళవారం తో ముగిసాయి. ఈ మహాసభలకు గ్రూప్ సి జనరల్ సెక్రెటరీ మరియు సెక్రటరీ జనరల్ అయినటువంటి వాసిరెడ్డి శివాజీ , మాజీ సెక్రెటరీ జనరల్ కిషన్ రావు, పోస్ట్మాన్ గ్రూప్ డి, గ్రామీణ డాక్ సేవకులు రాష్ట్ర నాయకులు హాజరై భవిష్యత్ కార్యాచరణను రూపొందించారు. ప్రస్తుత పరిస్థితులలో తపాలా శాఖ ఉద్యోగులు ఎదుర్కొంటున్న అనేక సమస్యలపై చర్చించి తీసుకోబోయే నిర్ణయాలను తెలియజేశారు. ఈ సమావేశాలకు గత రెండు రోజులుగా చైర్మన్గా జి నాగేశ్వరరావు, సెక్రటరీగా రమేష్ నాయక్ వ్యవహరించారు. మమ్మీ వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో రానున్న రెండు సంవత్సరాలకు నేషనల్ యూనియన్ ఆఫ్ పోస్టల్ ఎంప్లాయిస్ గ్రూప్ సి రాష్ట్ర కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. తెలంగాణ రాష్ట్ర ప్రెసిడెంట్గా ఎం వెంకన్న, వర్కింగ్ ప్రెసిడెంట్గా పమ్మి వెంకటేశ్వర్ రావు, కార్యదర్శిగా రామ్ కుమార్, కోశాధికారిగా నరసింహారెడ్డి, సహాయ కార్యదర్శిగా ఆర్ సంతోష్ , 15 మంది కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.

## రక్తదానం చేయండి జీవితాలను కాపాడండి

**భద్రాద్రి కొత్తగూడెం, జూలై 15 (మహా):** యువత రక్తదానాన్ని ఆదర్శంగా తీసుకొని రక్తదానం చేసి జీవితాలను కాపాడాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ పిలుపునిచ్చారు. మంగళవారం జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్, జిల్లా ఎస్పీ రోహిత్ రాజు నేతృత్వంలో జిల్లా రవాణా శాఖ, ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో ఇండియన్ యూత్ సెక్యూర్డ్ ఆర్గనైజేషన్ సౌజన్యంతో కొత్తగూడెం పట్టణంలోని రైల్వే స్టేషన్ ఆవరణంలో రోడ్ సేఫ్టీ ఎడ్యుకేషన్ కార్యక్రమంలో భాగంగా ఉచిత రక్త పరీక్ష శిబిరాన్ని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఉచిత రక్త పరీక్ష శిబిరంలో పరీక్షలు చేయించుకోవడం ద్వారా ప్రజలు తమ యొక్క బ్లడ్ గ్రూప్ తెలుసుకోవడం సులభతరం అవుతుందన్నారు. దీని ద్వారా అత్యవసర సందర్భాల్లో రక్తదానం చేసేందుకు సులభంగా ఉంటుందని, అత్యవసర సమయంలో ఇది ఎంతగానో ఉపయోగపడుతుందని కావున ప్రజలు, కార్మికులు పెద్ద ఎత్తున ఈ ఉచిత రక్త పరీక్ష శిబిరం ని ఉపయోగించుకొని తమ యొక్క బ్లడ్ గ్రూపు వివరాలను తెలుసుకోవాలని కోరారు. ముఖ్యంగా యువత రక్తదానం కార్యక్రమం ఆదర్శంగా తీసుకొని ఆపద కాలంలో రక్తదానం చేసి జీవితాలను నిలబెట్టాలని కలెక్టర్ కోరారు.

## ప్రతి నెల ఏడవ తారీకు లోపే జీతాలు చెల్లించాలి

**భద్రాద్రి కొత్తగూడెం, జూలై 15 (మహా):** సింగరేణి కాంట్రాక్టు కార్మికుల కార్మికులకు ప్రతినెల ఏడవ తారీకు లోపే జీతాలు చెల్లించాలని భూక్యా రమేష్ డిమాండ్ చేశారు. మంగళవారం సింగరేణి అడ్డాల మీద కార్మికులతో ఏర్పాటు చేసిన సభల్లో ఆయన మాట్లాడుతూ, ప్రతినెల ఏడవ తారీఖు లోపే జీతాలు చెల్లించే విధంగా సింగరేణి యాజమాన్యం ప్రతి కాంట్రాక్టర్ కి నిబంధనలు ప్రకారం చెప్పినప్పటికీ 20 నుంచి 25 తారీకు లోపు చెల్లిస్తున్నారని, ఫలితంగా కార్మికులు అనేక ఇబ్బందులు అయ్యి నెలవారి కట్టుకునేటువంటి అప్పులు, ఈ ఎమ్మై లు , ఇంటి ఖర్చులు అనేక సమస్యలతో సతమాతమవుతున్న స్థితి ఉందన్నారు. ఆలస్యం కోసం కాంట్రాక్టర్లను కార్మికులు అడిగితే ఇష్టం వచ్చిన రీతిలో సమాధానం చెబుతున్నారన్నారు.

FOLLOW: @ANNTELUGU
16-7-2025
WWW.EPAPER.MAHAADAILY.COM
భద్రాద్రి కొత్తగూడెం
మహా పత్రిక
ANN తెలుగు

## యంత్రాలు సకాలంలో అందించారా..!



**నేలకొండపల్లి, జులై 15 మహా :** ఖరీఫ్, రబీ సీజన్లలో ధాన్యం కొనుగోలు కేంద్రాల కు సంబంధించిన యంత్ర పరికరాలు సకాలంలో అందించరా లేదా అనే విషయాల పై ప్రభుత్వం నియమించిన రాష్ట్ర కో–ఆర్డినేటర్ ప్రొఫెసర్ బీ.ఎన్.రావు ఆరా తీశారు. మంగళవారం మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ లో యంత్రాలను, ఫ్యాడీక్లీనర్, తేమ శాతం యంత్రం, ఎలక్ట్రానిక్ కాంటాలు, లిఫ్టర్ మరియు క్లీనర్ యంత్రాలను పరిశీలించారు. ప్రభుత్వం ఇచ్చిన యంత్రాలు ప్రస్తుతం ఉన్నాయా లేదా అని క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. అనంతరం మార్కెట్ కార్యాలయం లో సొసైటీ సీఈవోలు, ఐకేపీ, మార్కెట్ అధికారులతో ప్రత్యేక సమావేశం –నిర్వహించారు. యంత్రాలు కొనుగోలు సమయంలో సంబంధిత అధికారులు అందించరా లేక జాప్యం చేశారా అని వివరాలు అడిగి తెలుసుకున్నారు. యంఎస్పీ యంత్రాలు 350, టార్పాలిన్ లు 15 వేలు, ఎలక్ట్రానిక్ కాంటాలు 350, తేమ శాతం పరిశీలన యంత్రాలు 362 లను జిల్లా లోని ఆయా కొనుగోలు కేంద్రాలను సరఫరా చేసిన వాటి వివరాలు, అవి సక్రమంగా పని చేస్తున్నాయా లేదా మరమ్మతులతో ఇబ్బంది పెట్టాయా ...ప్రస్తుతం వాటి కండీషన్ ఎలా ఉంది..ఇంకా కేంద్రాలకు ఏమైనా సౌకర్యాలు కావాలా అని ఇటు రైతుల నుంచి..అటు అధికారుల నుంచి వివరాలు సేకరించారు. అనే విషయాలను తెలుసుకున్నారు.

## ఎన్ఆర్ఐ ఫౌండేషన్ ల్యాప్ టాప్ వితరణ




**కూసుమంచి, జులై 15, మహా:** ఎన్ ఆర్ఐ ఫౌండేషన్ మరోసారి దాతృత్వాన్ని చాటుకుంది. నిరుపేద విద్యార్థినికి చదువుకోసం మంగళవారం ల్యాప్ టాప్ అందజేసింది. కూసుమంచి మండలం జక్కేపల్లి గ్రామానికి చెందిన జడం నవీన కోదాడ కిట్స్ కళాశాలలో బీటెక్ చదువుతోంది. తల్లిదండ్రులు లేకపోవడంతో మేనమామ సహాయంతో విద్యాభ్యాసం కొనసాగిస్తోంది. ఈ విషయాన్ని ఎన్ఆర్ఐ ఫౌండేషన్ సభ్యురాలు, హర్యతండా ప్రధానోపాధ్యాయులు తీర్థాల శ్రీదేవి లెనిన్ గారి దృష్టికి తీసుకెళ్లారు. లెనిన్, శ్రీదేవిలు సంయుక్తంగా నవీనకు ల్యాప్ ట్యాప్ కొనుగోలు చేసి ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా ఎన్ఆర్ఐ ఫౌండేషన్ కు నవీన, కుర్రి సైదులు కృతజ్ఞతలు తెలిపారు. ఈకార్యక్రమంలో బయ్యన బాబురావు,లెనిన్, నాగేశ్వరరావు,శ్రీదేవి పాల్గొన్నారు.

## బిసిల మహా ధర్నాలో రాఘవేందర్



**భద్రాద్రి కొత్తగూడెం, జూలై 15 (మహా):** స్థానిక సంస్థలలో 42 శాతం వెనుకబడిన తరగతుల (బిసిపిఎఫ్) రిజర్వేషన్లకు చట్టబద్ధత కల్పించి వెంటనే ఎన్నికలు నిర్వహించాలని కోరుతూ, కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌లో ప్రకటించిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ బిసిల హక్కుల కోసం సాగుతున్న ఈ పోరాటానికి కొత్తగూడెం నియోజకవర్గం నుంచి బలమైన మద్దతు తెలియజేస్తూ బిసి నేత వనమా రాఘవేందర్ ఆధ్వర్యంలో బిసి నేతలు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు చురుకుగా పాల్గొన్నారు. ఈ బిసి మహా ధర్నా లో జాతీయ బిసి సంఘం భద్రాద్రి జిల్లా యువజన అధ్యక్షులు బత్తుల మధుచంద్, మాజీ ఆత్మ కమిటీ ఛైర్మెన్ బత్తుల వీరయ్య, బిసి నాయకులు ముత్యాల ప్రవీణ్, ఎండి హుస్సేన్, మధుసూదన్ రావు,జూపెల్లి దుర్గా ప్రసాద్, బండ్ల పవన్ పాల్గొన్నారు.

## స్వయం సహాయక కార్యాలయంలో వైద్య శిబిరం

**టేకులపల్లి - మహా :** ఇందిరా మహిళ శక్తి సంబరాలలో భాగంగా జిల్లా కలెక్టర్, గ్రామీణాభివృద్ధి సంస్థ జిల్లా ఆదేశానుసారం స్వయం సహాయక సంఘ మహిళ సభ్యులలో రక్తహీనతను గుర్తించడానికి జరిగిన ప్రత్యేక వైద్య శిబిరం సులానగర్ ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జరిగింది ఈ కార్యక్రమం జరుగుతున్న తీరు తెన్నులను పరిశీలించడానికి భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అడిషనల్ కలెక్టర్ విద్యా చందన వచ్చారు ఈ సందర్భంగా స్వయం సహాయక సంఘ మహిళా సభ్యుల సమావేశంలో మాట్లాడుతూ భారతీయ మహిళల్లో ఎక్కువ మంది రక్తహీనతతో బాధపడుతున్నారని ఆరోగ్యమే మహాభాగ్యమని రక్తహీనత వల్ల నీరసం ఆయాసం తద్వారా పనులు చేసుకోలేకపోవడం రక్తహీనత లోపాన్ని అధిగమించడానికి కావాల్సిన ఎక్కువ ఇనప దాతువు ఉన్న ఆహారాన్ని తీసుకోవడం మంచిదని పెరటి తోటల్లో పెంచిన ముదురు రంగు ఆకుకూరలను విరివిగా తీసుకోవడం మునగాకు కరివేపాకు బెల్లంతో తయారు చేసిన రాగి లడ్డు నువ్వుల లడ్డు పల్లి చెక్క రోజువారీ తీసుకోవడం అలాగే విటమిన్ సి ఉన్న నిమ్మజాతి పండ్లను విరివిగా తీసుకోవాలని కోరారు



## మంత్రి పొంగులేటిని మర్యాద పూర్వకంగా కలిసిన ఎమ్మెల్యే కోరం కనకయ్య

**టేకులపల్లి - మహా :** తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య హైదరాబాద్ మినిస్టర్ క్వార్టర్స్ కాంగ్రెస్ ముఖ్య నాయకులతో మర్యాదపూర్వకంగా కలిశారు ఈ కార్యక్రమంలో ఇల్లందు నియోజకవర్గ నాయకులు, కోరం సురేందర్ టేకులపల్లి పిఎసిఎస్ చైర్మన్ లక్కినేని సురేందర్ రావు, ఆత్మ కమిటీ చైర్మన్ బోడ మంగీలాల్ నాయక్, మండల నాయకులు ఈది గణేష్, ఇస్లావత్ రెడ్యానాయక్, గడ్డం మధురెడ్డి, దళపతి శ్రీనివాస్ రాజు,భద్రు నాయక్,పోషాలు, భద్రం, రవి నాయక్, సర్దార్, ఇస్తారీ, లక్ష్మీనారాయణ, వేణు తదితరులు పాల్గొన్నారు

## టేబుల్ టెన్నిస్ బోర్డ్ గేమ్‌ను ప్రారంభించిన ఐటీడీఏ పీవో

**భద్రాద్రి కొత్తగూడెం, జూలై 15 (మహా):** జూలూరుపాడు మండల పరిధి పడమట నర్సాపురం లోని గిరిజన బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాల లో భద్రాచలం ఐటిడిఏ ప్రాజెక్ట్ అధికారి బి రాహుల్ టేబుల్ టెన్నిస్ బోర్డ్ గేమ్ ను మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థినులను మధ్యాహ్న భోజనం మెనూ గురించి అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులతో వివిధ రకాల ఆటలను ఆడించారు. విద్యార్థుల తెలివితేటలను పరీక్షించారు. అనంతరం పాఠశాలకు ఐటిడిఏ తరఫున కేటాయించిన టేబుల్ టెన్నిస్ గేమ్ ను విద్యార్థితో ఆడి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో వివిధ రకాల క్రీడలను ప్రోత్సహిస్తూ, సంబంధిత క్రీడా సామాగ్రిని అందజేస్తున్నామని తెలిపారు. దానిలో భాగంగానే నర్సాపురం పాఠశాలకు క్రీడా మైదానం లేనందున ఇండోర్ గేమ్స్ ఆడుకునేందుకు హాకీ కిట్, క్యారం బోర్డ్స్ అందజేశామని అదేవిధంగా, అదే విధంగా ఇప్పుడు టేబుల్ టెన్నిస్ గేమ్ బోర్డును అందజేశామని తెలిపారు. కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ స్పోర్ట్స్ ఆఫీసర్ బోల్లి గోపాలరావు, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సుభద్ర, పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## ఆయిల్ పామ్ తోటల్లో డ్రిప్ సౌకర్యం యుద్ధ ప్రాతిపదికన కల్పించాలి



**ఖమ్మం, మహా:** ఆయిల్ పామ్ తోటల్లో డ్రిప్ సౌకర్యం యుద్ధ ప్రాతిపదికన కల్పించాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా కలెక్టర్, ఆయిల్ పామ్ సాగు, డ్రిప్ సౌకర్యం ఏర్పాటుపై సంబంధిత అధికారులతో మంగళవారం సాయంత్రం సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ జిల్లాలో ప్రస్తుత సీజన్ లో ఇప్పటి వరకు 4472 ఎకరాలలో ఆయిల్ పామ్ సాగుకు పరిపాలన అనుమతులు మంజూరు చేసామని, 2522 ఎకరాలలో మొక్కలు నాటితే 931 ఎకరాలలో మాత్రమే డ్రిప్ ఏర్పాటు కావడం పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆయిల్ పామ్ సాగుకు మొక్కలు నాటిన తర్వాత డ్రిప్ ఏర్పాటు ఆలస్యం కాకుండా చూడాలని అన్నారు. డ్రిప్ ఇరిగేషన్ వ్యవస్థ ఏర్పాటు వేగంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని, వారం రోజులలో పురోగతి కనిపించని పక్షంలో వేరే కంపెనీలకు అవకాశం కల్పించాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. ఆగస్టు 15 నాటికి జిల్లాకు కేటాయించిన నిర్దేశిత లక్ష్యం మేరకు ఆయిల్ పామ్ ప్లాంటేషన్ పూర్తి చేయాలని, ఆయిల్ పామ్ ప్లాంటేషన్ తో పాటు డ్రిప్ ఏర్పాటుకు సమాంతరంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులకు తెలిపారు. జిల్లాలో పెరుగుతున్న విస్తీర్ణం అనుగుణంగా ఒకే కంపెనీపై ఆధారపడకుండా పలు కంపెనీల ద్వారా త్వరగా మన రైతుల పొలాల్లో డ్రిప్ సౌకర్యం ఏర్పాటుకు యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు.

FOLLOW: @ANNTELUGU
16-7-2025
WWW. EPAPER.MAHAADAILY.COM
భద్రాద్రి కొత్తగూడెం
మహా పత్రిక
ANN తెలుగు

# పచ్చదనం పెంపుకు ప్రాధాన్యత ఇవ్వాలి

**ఖమ్మం, మహా:** జిల్లాలోని గ్రామీణ, పట్టణ స్థానిక సంస్థల్లో పారిశుద్ధ్య నిర్వహణ, పచ్చదనం పెంపుకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్, స్థానిక సంస్థల పనితీరుపై స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డా. పి. శ్రీజతో కలిసి మంగళవారం సంబంధిత అధికారులతో సమీక్షించారు. వన మహోత్సవం, పారిశుద్ధ్య నిర్వహణ, సీజనల్ వ్యాధుల నియంత్రణ, త్రాగు నీటి సరఫరా, ఉపాధి హామీ పనులు, ఇందిరా మహిళా డెయిరీ, తదితర అంశాలపై కలెక్టర్ అధికారులతో చర్చించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ జిల్లాలోని గ్రామీణ ప్రాంతాలు, పట్టణ ప్రాంతాల్లో స్థానిక సంస్థలు, మునిసిపాలిటీ ల ఆధ్వర్యంలో పరిపాలన సజావుగా సాగేందుకు ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతలు కట్టుదిట్టంగా నిర్వహించాలని అన్నారు. వన మహోత్సవం కార్యక్రమం క్రింద అవెన్యూ ప్లాంటేషన్, బ్లాక్ ప్లాంటేషన్ లపై అధిక శ్రద్ధ పెట్టాలన్నారు. జిల్లాలోని ప్రధాన రోడ్ల వెంబడి మొక్కలు నాటే ఆస్కారం చాలా ఉందని కలెక్టర్ తెలిపారు.



ప్రస్తుత సంవత్సరం అవెన్యూ ప్లాంటేషన్ పంచాయతీ రోడ్డు, ఆర్ అండ్ బీ రోడ్డు, పట్టణాలలో మేయిన్ రోడ్ల వెంబడి పెద్ద ఎత్తున జరగాలని అన్నారు. జిల్లాలో రోడ్డు వైపు పిచ్చి మొక్కలు అధికంగా పెరిగాయని, వీటిని వెంటనే తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని అన్నారు. రోడ్డు వెంబడి ఎత్తైన మొక్కలు నాటాలని అన్నారు. ఆగస్టు నెలలో జిల్లా రోడ్లలో ప్రయాణిస్తుంటే వన మహోత్సవం ప్రభావం స్పష్టంగా తెలిసేలా మార్పు తీసుకుని రావాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రతి మండలంలో బ్లాక్ ప్లాంటేషన్ స్థలాలను ఫైనల్ చేయాలని, మియావాకీ పద్ధతిలో మొక్కలు నాటాలని, ప్రతి మండలంలో అటవీ శాఖ, గ్రామీణ అభివృద్ధి శాఖ అధికారులు మంచి మొక్కలు నాటాలని చిన్న అడవి లాంటి ప్రాంతాన్ని సృష్టించాలని అన్నారు. బ్లాక్ ప్లాంటేషన్ లో ముఖ్య అతిథులు పాల్గొనేలా చూడాలని అన్నారు. బ్లాక్ ప్లాంటేషన్ కు రెగ్యులర్ వాటర్ సప్లై ఉండేలా చూడాలని అన్నారు. జిల్లాలోని పట్టణ ప్రాంతాలలో కూడా 2 ఎకరాలలో అర్బన్ పార్క్ ఏర్పాటుకు స్థలాలను గుర్తించి, అక్కడ ఎటువంటి మొక్కలు నాటాలో ప్రణాళిక సిద్ధం చేసి నివేదిక అందించాలని కలెక్టర్ మున్సిపల్ కమీషనర్లను ఆదేశించారు. జిల్లాలో ఆగస్టు మొదటి వారం నాటికి బ్లాక్ ప్లాంటేషన్, రోడ్ల వెంబడి అవెన్యూ ప్లాంటేషన్ పూర్తి చేయాలని అన్నారు. ప్రతి మండలం పనితీరు పరిశీలించి బాగా పనిచేసిన మండలాలకు గుర్తింపు ఇవ్వడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు.

# సిగాసి కార్మికులకు నష్టపరిహారం చెల్లించాలి



**ముదిగొండ జూలై 15 మహా:** గత నెల 30న సంగారెడ్డి జిల్లా పాశమైలారం సిగాసి ఫార్మా కంపెనీలో జరిగిన అగ్నిప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన కార్మికులకు నష్టపరిహారం చెల్లించాలని సిఐటియు జిల్లా నాయకులు టీఎస్ కళ్యాణ్ ప్రభుత్వం డిమాండ్ చేశారు.సిగాసి ఘటనపై సిఐటియు ఆధ్వర్యంలో ముదిగొండ పారిశ్రామిక ప్రాంతంలో మంగళవారం నిరసన వ్యక్తం చేశారు.ఈసందర్భంగా ఆయన మాట్లాడారు.ప్రాణాలు కోల్పోయిన కార్మికుల కుటుంబాల వారికి ఉద్యోగం కల్పిస్తూ పర్మనెంట్ చేయాలన్నారు.ఇతర రాష్ట్రాల నుండి బతుకుతెరువు కోసం వలస వచ్చి పనిచేస్తూ ఫ్యాక్టరీలో రియాక్టర్ పేలి 41 మంది కార్మికులు ప్రాణాలు బలైపోయాయన్నారు.34 మంది కార్మికులకు క్షతగాత్రులు మారి వివిధ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారన్నారు. ఫ్యాక్టరీ యజమాన్యంపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకొని,ప్రాణాలు కోల్పోయిన వారితోపాటు,క్షతగాత్రులకు నష్టపరిహారం చెల్లించాలని టీఎస్ కళ్యాణ్ పేర్కొన్నారు.ఈకార్యక్రమంలో గ్రానైట్ కార్మికులు యు ఉపేందర్,ఎన్ పరశురాం,ఎన్ నరేష్,ఎస్కే ఖాసిం,ఎ నరేష్,ఎన్ వెంకయ్య,ఎల్లయ్య,అబ్బాస్, రామారావు తదితరులు పాల్గొన్నారు.

# రైతు నేస్తం రైతులకు ఉపయోగం



**ముదిగొండ జూలై 15 మహా:** రైతు నేస్తం కార్యక్రమం ద్వారా రైతులకు మేలు జరుగుతుందని మధిర వ్యవసాయ శాఖ ఏడిఏ ఎన్ విజయ్ చంద్ర అన్నారు.ముదిగొండ రైతువేదికలో రైతు నేస్తం కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడారు.ఖరీఫ్ సీజన్లో పంటల సాగుపై,రైతులకు పలు సూచనలు సలహాలు ఆయన సూచించారు.వానాకాలంలో వరి సాగు చేపట్టే పద్ధతి,నారు పోసుకునే విధానం,డ్రమ్స్ సీడర్ ద్వారా నాట్లు వేసి,వరి సాగులో కలుపు తీసే విధానం,వరి సాగులో ఉపయోగించాల్సిన ఎరువులు,నానో యూరియా ఉపయోగాలు,వినియోగించే విధానాన్ని ఏడిఏ రైతులకు వివరించారు.రైతు నేస్తం రైతులు వ్యవసాయ పద్ధతులను నేర్చుకోవడానికి ఉపయోగమన్నారు.అనంతరం ఆయన ఉచితంగా కంది విత్తనాలను రైతులకు అందజేశారు. ఏవో సరిత, ఏఈఓ ఆకారపు మౌనిక పలువురు రైతులు పాల్గొన్నారు.

# పేదల శస్త్ర చికిత్సలకు ఎల్ఓసీ అందజేత

**కారేపల్లి, మహా:** కారేపల్లి మండలంలో పేదల్కైన నల్గురు వైద్య ఖర్చులకు ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి ఎల్ఓసీ పత్రాలను అందజేశారు. కమలాపురంకు చెందిన కొల్లి నాగమ్మ, జాలా ధనమ్మ, మండెపూడి కృష్ణారావు, మండెపూడి సత్యమ్మ లకు మోకాలు ఆపరేషన్ చేయాల్సి ఉంది. దీనికి బాధితులు ఎల్వోసీ కోసం ఎంపీ రఘురాంరెడ్డి ద్వారా దరఖాస్తు చేసుకున్నారు. ఎంపీ సీపార్స్‌తో ఒక్కొకరికి రూ.1.50 లక్షలు చొప్పున రూ.6 లక్షలు సీఎంఆర్ఎఫ్ నుంచి మంజూరైనాయి. దానికి సంబంధించి పత్రాలను ఎంపీ అందజేశారు. బాధితులు త్వరగా కోలుకోవాలని ఎంపీ ఆకాంక్షించారు.



# చీమలపాడు సబ్ స్టేషన్‌లో ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు

**కారేపల్లి, మహా :** కారేపల్లి మండలం చీమలపాడు సబ్ స్టేషన్ పరిధిలో లోవోల్టేజీ సమస్యను అధికమించటానికి అదనంగా 5ఎంవీఏ కేపాసిటీ గల విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేశారు. ఈ ట్రాన్స్‌ఫార్మన్ ను మంగళవారం ఖమ్మం ఎస్ఈ ఇనుగుర్తి శ్రీనివాసాచారి ప్రారంభించారు. చీమలపాడు సబ్ స్టేషన్ పరిధిలో నూతనంగా పోడు భూములకు విద్యుత్ కనెన్షన్లు ఇచ్చిన క్రమంలో వ్యవసాయ అవసరాలకు లోవోల్టేజీ సమస్య ఉత్పన్నం అయింది దానిని అధికమించటానికి సబ్ స్టేషన్‌లో అదనంగా ట్రాన్స్‌ఫార్మర్ అవరమైంది. ఈకార్యక్రమంలో ఖమ్మం ఎంఆర్టీ, కన్‌ట్రాక్షన్ డీఈ భద్రు పవార్, రామారావు, ఏడీ రాందాస్, ఏడీఈ అంనద్‌కుమార్, ఏఈ రామకృష్ణ, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.



# 44వ నాబార్డ్ వ్యవస్థాపక దినోత్సవం



**చింతకాని, జులై 15 (మహ):** పి.ఎ.సి.యస్ నాగులవంచ సంఘమునకు 44వ నాబార్డ్ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా నాగులంచ సహకార సంఘమును ఉత్తమమైన పనితీరుకుగాను నాబార్డ్ వారు ఉత్తమమైన సహకార సంఘం గా గుర్తించి సంఘమునకు తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ మరియు సహకార శాఖ మంత్రి చేతుల మీదుగా అవార్డును హైదరాబాద్ నాబార్డ్ కార్యాలయం నందు సంఘ అధ్యక్షులు నల్లమోతు శేషగిరిరావు , సంఘ కార్యదర్శి యాలముడి శ్రీనివాసరావు అందజేశారు.

# హెల్త్ సెంటర్లను సందర్శించిన డీఎంహెచ్‌వో



**కారేపల్లి, మహా:** కారేపల్లి మండలంలోని హెల్త్ సెంటర్లను జిల్లా వైద్యాధికారి డాక్టర్ కళావతిబాయి మంగళవారం సందర్శించారు. ఐటీడీఏ ఆధ్వర్యంలో తవిసిబోడులో ఏర్పాటు చేసిన మెడికల్ మోబ్కెల్ యూనిట్‌ను సందర్శించి పనితీరును పరిశీలించారు. సీతారాంపురం సబ్ సెంటర్‌ను సందర్శించిన డీఎంహెచ్‌వో సెంటర్ లో రికార్డులను పరిశీలించారు. గ్రామంలో డ్రైడే కార్యక్రమాన్నితనిఖీ చేశారు. సబ్ సెంటర్ పని తీరును ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఈసందర్బంగా ఆమె మాట్లాడుతూ సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని వైద్య సిబ్బందిని ఆదేశించారు. నీరు కలుషితం కాకుండా, మురిగి గుంటలు ఉండకుండా పంచాయతీ రాజ్‌శాఖ అధికారులతో సమన్వయంతో పని చేయాలన్నారు. డీఎంహెచ్‌వో వెంట మండల వైద్యాధికారి డాక్టర్ బీ.సురేష్ ఉన్నారు.

FOLLOW: @ANNTELUGU
16-7-2025
WWW. EPAPER.MAHAADAILY.COM
భద్రాద్రి కొత్తగూడెం
మహా పత్రిక
ANN తెలుగు

## తహసిల్దార్ మారినా బోర్డు మారలే



**కారేపల్లి, మహా:** సింగరేణి తహసిల్దార్ కార్యాలయంలో అధికారి ఆఫీస్ ముందు ఉండే నేమ్ బోర్డు ఇక్కడి నుంచి బదిలీపై వెళ్లిన అధికారిదే దర్శనమిస్తుంది. వారం రోజుల క్రితం వరకు ఇక్కడ తహసిల్దార్ గా పనిచేసిన సంపత్ కుమార్ బదిలీ పై మహబూబాబాద్ వెళ్లారు. కల్లూరు ఆర్డీవో కార్యాలయంలో ఏవోగా చేసిన అనంతుల రమేష్ ను సింగరేణి తాసిల్దార్ గా నియమించారు. ఈనెల 9వ తేదీన రమేష్ బాధ్యతలు చేపట్టారు. వారం రోజులు గడుస్తున్నా తన ఆఫీసు ముందు ఉన్న నేమ్ బోర్డును కూడా మార్పించకపోవడంతో కార్యాలయానికి వచ్చిన వారంతా చర్చించుకుంటున్నారు. బాధ్యతగా వ్యవహరించాల్సిన అధికారులు నేమ్ బోర్డు మార్పించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించడంపై రకరకాలుగా చర్చకు దారి తీయడం విచారకరం.

## జిల్లా మహాసభను జయప్రదం చేయండి

కారేపల్లి, మహా:పేద ప్రజల పక్షాన పోరాడే పార్టీ భారత కమ్యూనిస్టు పార్టీ అని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు రావి శివరామకృష్ణ అన్నారు.మండల కేంద్రంలో మంగళవారం పార్టీ నాయకులు ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈనెల 19,20 తేదీలలో మధిర టౌన్ రెడ్డి గార్డెన్స్ లో జరిగే 23వ జిల్లా మహాసభ ను పార్టీ శ్రేణులు అత్యధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని,ఈ జిల్లా మహాసభలకు సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కొత్తగూడెం శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివరావు,శాసనమండలి సభ్యుడు నెల్లికంటి సత్యం ముఖ్య అతిథులుగా పాల్గొంటారని తెలిపారు. అదేవిధంగా జాతీయ సమితి సభ్యులు భాగం హేమంతరావు, సిపిఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ చైర్మన్ మహమ్మద్ మౌలానా అతిథులుగా పాల్గొంటున్నారని తెలిపారు.అదేవిధంగా అమాయక పేద బడుగు బలహీన వర్గాల ప్రజల సమస్యలే పరిష్కారంగా పార్టీ పనిచేస్తుందని అన్నారు. ఎంతోమంది బడుగు బలహీన వర్గాల శ్రేయస్సు కోసం జరిగిన పోరాటాల్లో భారత కమ్యూనిస్టు పార్టీ ప్రత్యేక పాత్ర పోషించిందని అన్నారు.

# వైరా రిజర్వాయర్ నుంచి 22 వేల ఎకరాలకు సాగునీళ్లు విడుదల

**వైరా, మహా:** రైతుల కష్టానికి సాగునీటిని అందిస్తూ, వైరా రిజర్వాయర్ ఆయకట్టకు నీళ్లు విడుదల చేయడమై జిల్లాలో సంతోషం వెల్లివిరిచింది. వేదమంత్రాల మధ్య, భక్తిశ్రద్ధలతో సాగునీటి విడుదలను ప్రారంభించిన వైరా శాసనసభ్యులు మాలోత్ రాందాస్ నాయక్ , రైతుల మోక్షంగా కనిపించారు. ఈ కార్యక్రమంలో ఆయనతో పాటు రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడిన ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ మాట్లాడుతూ, "పది సంవత్సరాల తరువాత రైతు కన్నీళ్లకు మళ్లీ వెలుగొచ్చింది. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత అన్నదాతలకు నిజమైన గౌరవం లభిస్తోంది. రైతుకు నీళ్లు ఇవ్వడమే మా రాజధర్మం. కాంగ్రెస్ అంటే రైతు పక్షపాత పార్టీ. రైతు పచ్చగా ఉంటేనే రాష్ట్ర అభివృద్ధికి బాట పడుతుంది," అని పేర్కొన్నారు. వైరా రిజర్వాయర్ నుంచి విడిచిన నీటి ద్వారా వైరా నియోజకవర్గంలోని మొత్తం 22 వేల ఎకరాల ఆయకట్టకు సాగునీరు అందనుండటంతో, రైతులలో ఎంతో ఆనందం వ్యక్తమవుతోంది. ఇది గడిచిన అనేక ఏళ్లలో సంభవించిన విశేష పరిణామంగా రైతులే స్వయంగా అంటున్నారు. ఈ కార్యక్రమం సందర్భంగా మేఘాలు కూడా కురిసి



రైతు ఆనందానికి వర్షం రూపంలో జత కలిశాయి. కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శులు నూతి సత్యనారాయణ, కట్ల రంగారావు, మండల అధ్యక్షులు శీలం వెంకట నర్సిరెడ్డి, వడ్డే నారాయణరావు, దాసరి దానియేలు, మాజీ మార్క్‌ఫెడ్ వైస్ చైర్మన్ బొర్రా రాజశేఖర్, పొదిల హరినాథ్, దొడ్డ పుల్లయ్య, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు ఏదునూరి సీతారాములు, బోళ్ల గంగారావు, బిడికే రత్నం, పమ్మి అశోక్, మట్టూరి వెంకటేశ్వరరావు, చప్పిడి వెంకటేశ్వరరావు, పణితి శ్రీను, దొబ్బల సౌజన్య, పుచ్చకాయల వీరభద్రం, మొక్క శేఖర్ గౌడ్, బొడ్డు బొందయ్య, వెజెండ్ల సాయి, చల్లా ప్రతిభ రెడ్డి తదితర నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# వైభవంగా చండీ కుబేర పాశుపత యాగం

**ఖమ్మం సిటీ, మహా:** తెలంగాణ రాష్ట్ర దూప దీప నైవేద్య అర్చక సంఘం ఆధ్వర్యంలో జరుగుతున్న చండీ కుబేర పాశుపత యాగం రెండవ రోజు అత్యంత వైభవంగా కొనసాగింది. మంగళవారం ఉదయం గణపతి పూజ, పుణ్యాహవాచనం, నవచండీయాగం, అరుణపారాయణం, మహా లింగార్చన, ఏకాదశ రుద్రయాగం నిర్వహించారు. ఈ యాగ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా నకిరేకల్ శాసన సభ్యులు వేముల వీరేశం, కరీంనగర్ మాజీ ఎమ్మెల్యే మృత్యుంజయ శర్మ దంపతులు హాజరై, అమ్మవారికి పట్టు వస్త్రాలు, పూలు, పండ్లు సమర్పించారు. అనంతరం వేదపండితుల ఆశీర్వచనాలు అందుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వేముల వీరేశం మాట్లాడుతూ, "అమ్మవారి ఆశీర్వాదంతో తెలంగాణ రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని కోరుకుంటున్నాం. అర్చకుల వేతనాలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి, వేతనం రూ. 23,000 నుంచి తగ్గకుండా ఉండేలా నా వంతు కృషి చేస్తాను," అని హామీ ఇచ్చారు. మాజీ ఎమ్మెల్యే మృత్యుంజయ శర్మ మాట్లాడుతూ, "దూప దీప నైవేద్య పథకం ప్రారంభ సమయంలో నేను శాసనసభ్యుడిగా ఉన్నాను. అర్చకులకు కనీస వేతనం పెంచటం ఇప్పుడు అత్యవసరం. ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వారి సంక్షేమం కోసం కృషి చేస్తాను," అని తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రావాల్సిన మంత్రి శ్రీధర్ బాబు అత్యవసరంగా సచివాలయానికి వెళ్లి రాలేకపోయారు. అయితే ఫోన్ ద్వారా యాగ నిర్వాహకులకు అభినందనలు, శుభాకాంక్షలు తెలిపారు. యాగంలో రామానంద తీర్థ ప్రభుజీ, సాక్షి విరూపానంద గురూజీలు పాల్గొని అర్చకులకు అనుగ్రహ భాషణం చేశారు. సాయంత్రం వేదపారాయణ, నీరాజనం, పుష్పార్చనలు వేద స్వస్తి మంత్రాలతో ఈరోజు కార్యక్రమాలు ముగిశాయి. యాగాన్ని అనిపెద్ది నరేష్ శర్మ బృందం శ్రద్ధగా నిర్వహించింది. వివిధ జిల్లాల నుంచి వచ్చిన అర్చకులకు సంఘం తరఫున అధ్యక్షులు దౌతలబాద్ వాసుదేవ శర్మ కృతజ్ఞతలు తెలిపారు. పూర్ణాహుతి రోజున వందలాది అర్చకులు రావాలని కోరారు. కార్యక్రమానికి ముఖ్య



అతిథిగా హాజరయ్యేలా ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కకు ప్రజాభవన్‌లో ఆహ్వాన పత్రం అందించారు. అలాగే, గృహనిర్మాణ, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని హైదరాబాద్ క్యాంపు కార్యాలయంలో కలిసారు. ఖమ్మం జిల్లా అర్చక సంఘం నుంచి అధ్యక్షులు రమేష్ శర్మ, కార్యదర్శి భార్గవ చార్యులు, కన్వీనర్ ప్రసాద్ శర్మ, కొణిజర్ల మండల అధ్యక్షులు యశ్వంత్ శర్మ, ఖమ్మం రూరల్ అధ్యక్షులు అవధానులు సీతారామ శర్మ, నేలకొండపల్లి అధ్యక్షులు చిలుకూరు నాగమూర్తి, కూసుమంచి కార్యదర్శి సంగమేశ్వర ప్రసాద్ శర్మ, నందుల ఉదయ శర్మ, చిలకమర్రి అప్పలచార్యులు, నరేంద్ర, నాగేంద్ర చారి తదితరులు పాల్గొన్నారు.




# యూరియా ఏదయా..!

**ఖమ్మం, మహా:** ఉమ్మడి ఖమ్మం జిల్లాలో వానాకాలం సాగు జోరు మీద ఉంది. ఇలాంటి సమయంలో, రైతులు అత్యవసరంగా ఉపయోగించే యూరియా ఎరువులపై పెరుగుతున్న డిమాండ్, కొరత భయంతో ముందస్తుగా బస్తాలు కొనుగోలు చేయడమే కాదు, వాటిని ఇంటి వద్ద నిల్వ చేసుకునేందుకు పోటీపడుతున్నారు. మరోవైపు, వ్యవసాయ శాఖ, సహకార సొసైటీల వద్ద తగినన్ని నిల్వలున్నాయని చెబుతున్నా, బహిరంగ మార్కెట్‌లో యూరియా మాఫియా కదలికలతో రైతులు మానసికంగా ఒత్తిడికి లోనవుతున్నారు. వానాకాలం సీజన్ లో పంటలు పుష్కలంగా సాగుతున్నాయి. కానీ ఈ పంటల పెంపకానికి అవసరమైన యూరియా వంటి కీలక ఎరువుల కొరత భయం అన్నదాతలను కలవరపెడుతోంది. అధికారులు ఎరువులు సరిపడా ఉన్నాయని చెబుతున్నా, రైతులు మాత్రం "ఓనగూరిన పన్నీరు" అన్నట్లు ముందే బస్తాలు తెచ్చి ఇంటి వద్ద నిల్వ చేసుకోవడంలో నిమగ్నమవుతున్నారు. ఈ వానాకాలంలో జిల్లాలో 5.56 లక్షల ఎకరాల్లో పంటలు సాగుతాయన్న అంచనాతో, ఇప్పటివరకు 2.76 లక్షల ఎకరాల్లో సాగు పూర్తయింది. ముఖ్యంగా వరి (2.83 లక్షల ఎకరాలు), పత్తి (2.21 లక్షలు), మిర్చి (71 వేల ఎకరాలు) వంటి పంటలు భూమి దరితీస్తుండగా, ఆయిల్ పామ్, మామిడి, మొక్కజొన్న పంటలకూ సాగు కొనసాగుతోంది. పంటల ఈ విస్తరణకు తగిన ఎరువుల ప్రణాళికగా 54 వేల మెట్రిక్ టన్నులకు పైగా యూరియా అవసరం ఉంటుందని అధికారులు అంచనా వేస్తున్నారు. కానీ జూలై వరకు రావాల్సిన 14,654 మెట్రిక్ టన్నుల్లో ఇప్పటి వరకు వచ్చినది కేవలం 10,359 టన్నులే. అంటే ఇంకా 30% తక్కువగా ఉంది.

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 1.08 లక్షల మెట్రిక్ టన్నుల ఎరువులు అవసరం కాగా, ఇప్పటివరకు అందినవి కేవలం 49,015 టన్నులే. అంటే అవసరానికి అర్థాన్నికంటే తక్కువ. ఇది రైతుల ఆందోళనలకు ప్రధాన కారణం. ముఖ్యంగా ఇటీవల పత్తి సాగు విస్తరించడంతో యూరియా డిమాండ్ మరింత పెరిగింది. వ్యవసాయ అధికారులు చెబుతున్నదాని ప్రకారం, ఒక ఎకరానికి యూరియా బస్తా లేదా రెండే సరిపోతుందన్నా, రైతులు మాత్రం తరువాత దొరకకపోతుందన్న భయంతో మూడు నాలుగు బస్తాలను ముందుగానే కొనుగోలు చేస్తున్నారు. దీని వలన మార్కెట్‌లో యూరియా సరఫరా వేగంగా తగ్గిపోతోంది. ఇక వ్యాపారులు, ఈ పరిస్థితిని వాడుకుని ఎమ్మార్పీ రూ. 266కి ఉన్న యూరియా బస్తాను రూ. 350–400 వరకూ అమ్ముతున్నారు. దీనిపై అధికారులూ హెచ్చరికలు జారీ చేసినా, పర్యవేక్షణ మాత్రం సరైన స్థాయిలో లేదన్న విమర్శలున్నాయి. వ్యాపారులు మార్కెట్‌లో కలపకుండా నిల్వ చేసుకోవడం, కావాలని కొరత సృష్టించడం ప్రధాన సమస్యగా మారింది. రైతులు డబ్బు పెట్టి, క్యూలో నిలబడి కొనుగోలు చేస్తున్న తరుణంలో, కొందరు అధిక ధరకు అమ్మి లాభాలు గడించేందుకు ప్రయత్నిస్తున్నారు. ఈ దుష్ప్రభావం నేరుగా రైతులపై పడుతోంది. పంటల ప్రారంభ దశలో ఎరువులు వినియోగించాల్సిన అవసరం ఉండటంతో ఆలస్యం అన్నదాతల బతుకులపై ప్రభావం చూపే ప్రమాదం ఉంది. వివిధ షాపులు, రైతు సమాఖ్యలు, సొసైటీల వద్ద ఎరువుల నిల్వలపై జిల్లా వ్యవసాయ శాఖ అధికారులు రోజువారీ సమీక్షలు చేయాలి. ధరల నియంత్రణపై ప్రత్యేక నిఘా బృందాలను నియమించాలి. ఎరువుల అధిక వినియోగంపై రైతులకు అవగాహన కల్పించాలి. ఎంత అవసరమో అంతకంటే ఎక్కువ వాడటం వల్ల నేల జీవకణాలు నాశనం కావడమే కాకుండా, భవిష్యత్తులో తక్కువ ఫలితాలు రావచ్చు. పైగా, ఇతర రైతులకు ఎరువులు అందక మిగిలిన వ్యవసాయ వ్యాపార వ్యవస్థ మొత్తం గందరగోళంగా మారుతుంది. వానాకాలం పంటల విజయవంతతలో ఎరువుల పాత్ర అత్యంత కీలకం. ఖమ్మం, కొత్తగూడెం జిల్లాల్లో ఎరువుల కొరత భయం రైతులను ముందస్తు కొనుగోళ్లకు ప్రేరేపిస్తున్నా, సరఫరా వ్యవస్థలో పారదర్శకత, బాధ్యత, సమర్థత లేనిదే రైతుల నెత్తిన భారంగా మారే ప్రమాదం ఉంది. ఈ నేపథ్యంలో యూరియా తదితర ఎరువుల సరఫరా, ధరల నియంత్రణలో వ్యవసాయ శాఖ మరింత అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉంది. ఎరువుల మార్కెట్‌ను మాఫియాల వల్ల ముప్పు నుంచి కాపాడకపోతే, రైతుల నష్టాలు గణనీయంగా పెరుగుతాయి.

